# 1

# ఎందుకు అధికారమును గూర్చి పఠించవలెను?

ఈ పఠనమును మనము ప్రారంభించబోవుచుండగా, మొదటిగా ఆలోచించవలసిన పదము “అపాలజి” (apology) – నేడు సర్వసాధారణముగా వాడబడుచున్న భావముతో కాక అంతకంటె పూర్వకాలములయందు వాడబడిన భావముతో ఆలోచించాలి. “అపాలజి” (apology) అను ఆంగ్ల పదము అపాలజియ (*apologia*) అను గ్రీకు పదమునుండి వచ్చెను. ఈ పదము హేతువుతో కూడిన ప్రత్యుత్తరము లేదా ప్రతివాదము చెప్పు ఆలోచనను తెలియ జేయుటకు ఉపయోగించబడెను.

ఈ వరుస పాఠములు, దేవుని క్రొత్త నిబంధన సమాజమైయున్న, సంఘము కొరకు ఆయనను ఆరాధించుటలో గాత్రములతో పాడుటకు (వాద్య సంగీతముల సహకారములేకుండ పాడుట) దేవుడు ఉద్దేశించిన దృక్పథమును, వాదించు లేదా వివరించు పాఠములై యున్నవి. ఇది తనకు తానుగా అపాలజియయై (*apologia*) యున్నది. అయితే ఆ ప్రతివాదమును ప్రారంభించుటకు ముందు అపాలజియను (apologia) గూర్చిన మరొక విధమైన దృక్పథము ఉన్నది. ప్రత్యేకించి, ఈ ఉపోద్ఘాతమునందు, అధికారమును గూర్చిన అంశమును పఠించుటకు ఇంత ఎక్కువ సమయమును వెచ్చించవలసిన ఆవశ్యకత ఎందుకుగలదో నేను వివరించవలసియున్నది. శ్రద్ధ చూపవలసిన యితర అంశములు ఎన్నో ఉండగా, ఈ అంశముపై ఎక్కువ సమయమును ఎందుకు వినియోగించాలి?

## అధికారము నేరుగా మన ఆరాధనకు సంబంధించినదైయున్నది

క్రైస్తవులు ఈ అంశమును గూర్చి తప్పక పఠించవలెను. ఎందుచేతననగా ఇది దేవునిని ఆరాధించుటకు సంబంధించినదైయున్నది. దేవునిని ఆరాధించుట అను అంశమును గూర్చి బైబిలు ఎంతో అత్యధికముగా బాధ్యతను వహించుచున్నది. ఆరాధన దేవుని ప్రజలకు ప్రాథమికమైనదైయున్నది. ఆరాధనలో మనము దేవునిపై మరియు ఆయన మనపై కురిపించుచున్న ఆశీర్వాదముల పట్ల మన కృతజ్ఞత పై అత్యధికముగా దృష్టిని కేంద్రీకరింతుము. అదేవిధముగా, మనము ఆరాధించునప్పుడు, ఆ కృతజ్ఞతను వెల్లడి పరచు ప్రజలముగా మనము ఒకరితో ఒకరము పంచుకొనుటకు మనము కూడుకొనుచున్నాము. ఆరాధనలో మనము దేవుని చేరుకొనుటయందు క్రైస్తవులుగా మనము విభేదమును చూపించినట్లయితే – మనము కలిసికట్టుగా కూడికలో చేయు అతి ముఖ్యమైనది – మనము ఆ కార్యములో సంపూర్ణంగా పాలుపొందలేము మరియు అందుచేత మనము సేవలందించు వాటిలో కలిసి జీవించుటకు మరియు పని చేయుటకు ప్రోత్సహించు సంబంధ బాంధవ్యములను వృద్ధి చేసుకొనలేము. అటువంటి భేదములు సంఘము యొక్క పని పై వ్యతిరేక ప్రభావమును చూపును (చూడు యోహాను 17:20, 21).

అయితే, భేదముల యొక్క ఈ ఉదాహరణకు మూలము సత్యారాధన యొక్క స్వభావమును క్రైస్తవులు అర్థము చేసుకొను వివిధ మార్గములలో కలదని మనము గమనించవలయును.

దేవునిని మనము సంతోషపెట్టవలెననుకొనినట్లయితే ఎట్లు మనము ఆరాధించవలెను? ఆరాధనలో విధానము ప్రాముఖ్యమై యున్నదా - మనము ఉపయోగించు సంగీతము యొక్క విధానము కూడాను? ఆరాధనలో దేవునిని ఆరాధించుటకు ఉపయోగించు నిర్దిష్ట విధానము కంటె దేవుడు మన ఉద్దేశమును గురించి ఎక్కువగా అక్కర కలిగియున్నాడా? ఈ ప్రశ్నలన్నియు మన అంశమునకు సంబంధించిన వాటిలోనివై యున్నవి.

"మనము విధానమును మరియు ఉద్దేశమును కూడ పరిగణించవలెనా?" అని అడుగుట సరైన ప్రశ్నను లేవనెత్తును. ఉద్దేశము అవసరమైనదా, యథార్థత లేకుండ ఏర్పాటు చేయబడిన ఆ విధానమును పాటిస్తు ఆరాధించు ప్రజలను లేఖనములు ఖండించు చున్నవి (చూడు ఆమోసు 5:21-24.) మరోవైపు, ఈ యథార్థత లేని ప్రజలు పాటించు ఆరాధనలోని విధానములు దేవునిచే ఏర్పాటు చేయబడినవి. ఆరాధనను గూర్చి బైబిలు ఏమి బోధించుచున్నదో పరిశీలించు, మరియు ఆరాధనలో దేవుడు ఆశించిన విధానమును ఆయనే నిర్దేశించిన ఒక సుదీర్ఘమైన చరిత్ర కలదని మీరు కనుగొందురు.

దేవుడు ఒక ప్రయోజనమును ఉద్దేశించినాడు కాబట్టి, తన ప్రజలను ఒక విధముగా ఆరాధించుమని మరియు మరొక విధముగా వద్దని ఆజ్ఞాపించుటలో ఆయన ఒక మంచి ధ్యేయమును కలిగియుండెను. అందుచేత, ఉద్దేశముతో సంబంధము లేకుండ ఒక ఆరాధన విధానమును ఎన్నడు పాటించలేము. ఆరాధనలో ఒక విధానము ప్రాముఖ్యమైనది కాదు అని చెప్పుట సరియైనది కాదు. దేవుడు మనకు యిచ్చిన ఆజ్ఞలకుగల దేవుని కారణమును నిర్ణయించు సమర్థతగలవారుగా క్రైస్తవులు లేరు. కొన్ని ఆజ్ఞలకొరకై ప్రత్యేకమైన కారణములను బయలుపరచుటకు ఆయన ఎంచుకొనలేదు. ద్వితీయోపదేశకాండము 29:29 ఈలాగు చెప్పుచున్నది, "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మశాస్త్ర వాక్యములన్నిటిననుసరించి నడుచుకొనునట్లు బయలుపరచబడినవి యెల్లప్పుడు మనవియు మన సంతతి వారివియునగునని చెప్పుదురు." దేవుని ఆలోచనలు మరియు మార్గములు మనము అర్థము చేసుకొనుటకంటె మించినవై యున్నవి. యెషయా 55:8, 9 ఈలాగు చెప్పుచున్నది,

> "నా తలంపులు మీ తలంపులవంటివి కావు
> మీ త్రోవలు నా త్రోవల వంటివి కావు,"
> ఇదే యెహోవా వాక్కు.
> "ఆకాశములు భూమికిపైన ఎంత యెత్తుగా ఉన్నవో
> మీ మార్గములకంటె నా మార్గములు
> మీ తలంపులకంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి."

దేవుని యొక్క ఖచ్చితమైన కారణములను మనము అర్థము చేసుకొనినను లేదా అర్థముచేసుకొనక పోయినను, ఆయన చెప్పిన దానిని అంగీకరించుటకు మనము సిద్ధముగా నుండవలెను. ఆయన లక్షణము సత్యము, మరియు మనము ఆయన చిత్తమునకు విధేయత చూపినట్లయితే మనము బాగుపడుదుము.

దేవుడు మనకు బయలుపరచుటకు అనేక సంగతులను ఎంచుకొనెనని కూడా మనము గుర్తించుకొనవలెను (ఈ కార్యాచరణ సంగ్రహానికి 1 కొరింథీయులకు 2:6-13 చూడు).

ఆయన ఏమైతే బయలుపరచెనో దానిని ఎంతగా మనము అర్థము చేసుకొని గ్రహింతుమో దానిపై ఆత్మ సంబంధమైన అభివృద్ధికి సంబంధించిన వివిధ స్థాయిలలో ప్రభావితము చూపును. ఆయన యొక్క అనుచరులముగా, మనము అర్థము చేసుకొని గ్రహించుటలో వృద్ధి చెందుటకు కృషిచేయవలెనని ఆశించబడితిమి.[1]

అందుచేత, మనము దేవుని ఆజ్ఞల యొక్క కారణములను యెరిగినను లేదా యెరుగక పోయినను ఈ పాఠము ఒకేరీతిగానున్నది. మన ఆరాధనలో మనము ఉపయోగించు విధానమును మనకు తెలియజేయు ఆజ్ఞతో కలిపి, మనము ఆయన ఆజ్ఞలతో దేనిని విడిచి పెట్ట కూడదు. మరియు మార్పు చేయకూడదు. *దేవుడు క్రొత్త నిబంధన ప్రజలు తమ సంగీత ఆరాధనలో గాత్ర సంగీతమును ఉపయోగించవలెనని కోరుకొనుచున్నాడను స్థితిని లేఖన భాగములు బలపరచుచున్నట్లయితే, అప్పుడు మనము యితర విధముగానైనను ఆరాధించ వచ్చునని మనము భావించరాదు.*

## ప్రస్తుత సంవత్సరములలో అధికారము అత్యల్ప ప్రాధాన్యతను పొందెను

ఈ మధ్య కాలములో అత్యంత ప్రాధాన్యమునిచ్చి దృష్టిని కేంద్రీకరించక పోవుట ఈ అంశమును పఠించుటకు గల రెండవ కారణము – మొదటి శతాబ్దంలోని క్రైస్తవులకే కాదు సంస్కరణ కాలంలో కూడా.[2] సంఘ చరిత్రలో ప్రముఖ వ్యక్తులు తరచుగా ఈ అంశమును గూర్చి చర్చించారు. ఈ అంశానికి ఇప్పుడు యిచ్చిన దానికంటె ఎంతో ఎక్కువ ప్రాధాన్యత ఒకప్పుడు ఇచ్చారని ఈ సమాచారములు తెలియజేయుచున్నవి.

ఎందుకు ఇది నిజము? మన ప్రాధాన్యత యితర అంశములకు మళ్ళుటవలన ప్రజలు అధికారమును గూర్చి మాట్లాడుకొనుటను మానివేసిరా? అనేకమంది గ్రంథకర్తలు యిన్ని యుగములయందు తెలియజేసిన అంశమును చర్చించుట కేవలము మంచిది కాదు అని మనము ముగించుదుమా? ప్రస్తుతపు అప్రాధాన్యత అత్యంత తీవ్రమైన సమస్యకు సూచనయైయున్నదా? లేఖనములను యథార్థముగా పఠించుటకు అనేకులు అతి తేలికైన స్వభావమును కలిగియున్నారా? గత కాలమునందున్న వారు ఎల్లప్పుడు సరియైనవారని చెప్పుటకు నేను ధైర్యము చెయ్యను. వారు ఏమి చెప్పిరి మరియు ఎందుకు చెప్పిరో కనీసము గమనించకుండా వారి పనిని మనము ఖండించేటంతటి జ్ఞానవంతులమై నేడు ఉన్నామనుకునేటంతటి అమాయకులము కాదు.

## ఆరాధనలో వాద్యములను ఉపయోగించుటను గూర్చిన ప్రశ్నను అధికారము పరిష్కరించును

ఈ పఠనమును చేయుట కొరకైన మూడవ కారణము మన విశ్వాసములను రూఢి పరచుకొనునట్లు మనలను శక్తిమంతులుగా చేయుట కొరకైయున్నది. దేవుడు ఆజ్ఞాపించినది గాత్ర సంగీతము (a cappella singing) అని క్రీస్తు సంఘ సభ్యులు విశ్వసింతురు. అటువంటి బోధన సాధారణముగా వివరించవలసియున్నది, అయితే దానిని రూఢి పరచుకొనగలిగియుండుట కొరకు మరింత ఎక్కువ ప్రేరేపణ కలదు: దేవుని ప్రజలు ఎందుకు

విశ్వసించుచున్నారు ఏమి విశ్వసించుచున్నారో ఎరుగవలెనని లేఖనములు ఆజ్ఞాపించెను. పేతురు తన పత్రికను చదువు వారిని హెచ్చరించిన దానిని మనము తీవ్రమైనదిగా పరిగణించవలెను. "మీలో ఉన్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడగు ప్రతి వానికిని ... సమాధానము [*apologia* అపాలజియ] చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి, ..." (1 పేతురు 3:15బి).

దేవుడు తన ప్రజలు ఆయనను ఆరాధించుటలో గాత్ర సంగీతమును (a cappella singing) ఉపయోగించవలెనని మనము ఎందుకు నమ్ముచున్నామో మనము నిదర్శనమును చూపవలెను లేదా ఇది కేవలము అలవాటు లేదా ప్రాధాన్యతయై యున్నదనియైన ఒప్పుకోవలెను. ఈ విశ్వాసమునకు గట్టి సమాధానము మనము చూపించకపోయినట్లయితే అప్పుడు ఐక్యత నిమిత్తమై వాద్య సంగీతములను ఉపయోగించుటచే దేవునిని ఆరాధించువారినుండి ప్రత్యేకపరచుకొనుటను మనము మానివేయవలెను. మరొక పక్షముగా, ఇది దేవునికి సంబంధించినదైనట్లయితే, ఈ సత్యము విషయమై యితరులను ప్రేరేపించుటకు మనము చేయగలిగినదంత చేయలేని యెడల మనము బాధ్యత లేని శిష్యులమైయున్నాము.

ఈ పాఠములో, విశ్వాసమును గైకొనుటలోని అధికారము యొక్క ప్రాముఖ్యత, సంఘములో యేసు అధికారమునకు ప్రాముఖ్యత నిచ్చుటపై మనము దృష్టిని కేంద్రీకరింతుము. ఆరాధన యేసు అధికారమునకు లోబడి జరుగవలసిన విశ్వాస క్రియయై యున్నది.

ఈ బోధను వెల్లడిచేయుట కొరకైన ఉద్దేశము దేవుని కార్యము కొరకైన ప్రేమనుండి మరియు ఆయనను సంతోషపెట్టవలెనను ప్రజల కోరికనుండి ఉద్భవించినదై యున్నది. సత్యము స్వతంత్రులనుగా చేయునని కనుగొనుట కొరకైన బాధ్యతతో యిక్కడ పేర్కొన్న ఋజువులను యథార్థతతో మీరు పరిశీలింతురని నేను ఆశించుచున్నాను (యోహాను 8:32 చూడు). బెరయనుల మాదిరిని వెంబడించవలెనని (అపొస్తలుల కార్యములు 17:10, 11) మరియు మీకు మీరు లేఖనములను పరిశీలించవలెనని నేను మిమ్మును ప్రోత్సహించుచున్నాను.

---

సూచనలు

[1] అభివృద్ధి మరియు ఉపదేశమును గూర్చి ఎఫెసీయులకు 4:11–16; కొలొస్సయులకు 1:28, 29; హెబ్రీయులకు 5:11–14; 2 పేతురు 3:18లో నొక్కి చెప్పారు. [2]అధికారమనే అంశముపై అనేక మతశాఖలవారు తమ ఉపదేశమును పునరాలోచన చేస్తున్నారు. ఉదాహరణకు, the webpage of the Reformed Presbyterian Church of North America ని చూడు. "నమ్మకాలు" అనే వారి వెబ్ సైట్ పేజీలో ఈ ప్రతిపాదనను చేసారు: "దేవుని ఎలా ఆరాధించాలో ఆయన వాక్యములో స్పష్టంగా వివరించబడియున్నదని మేము నమ్ముతున్నాం. దేవుని వాక్యమును చదువుట మరియు వివరించుట ఆరాధనలోని ముఖ్య భాగమైయున్నది. మా స్తుతి గీతములలో దేవుని వాక్యమును మాత్రమే ఉపయోగించాం, తద్వారా బైబిలులోని దైవ ప్రేరేపిత రచనయైన కీర్తనల గ్రంథమును ఉపయోగించెదము. సంఘమును నడిపించుటలో అరాధనకు కేంద్రముగా క్రొత్త నిబంధనను ఆధారము చేసుకొని వాయిద్యాలను ఉపయోగించకయే పాడుదుము" (http://www.reformedpresbyterian.org/conv_beliefs.html; Internet; accessed 26 July 2004).